క్లుప్తంగా

హెన్రీ డునాంట్‌కు ఘనంగా నివాళి



హెన్రీ డునాంట్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జగన్మోహనరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డునాంట్ వర్ధంతిని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉన్న హెన్రీ డునాంట్ విగ్రహానికి ప్రతినిధులు పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు.. హెన్రీ డునాంట్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీ కోండలరావు, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు బి.చిన్మయరావు, పి.చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, బి.సతీష్, సూర్యప్రకాష్, సుజాత, పావని, చందు, భాగ్యభారతి, బాల్జీ, సుమతి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు



పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు తదితరులు

గార: వర్షం నీటితో భూగర్భ జలాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు చెప్పారు. ఇందులో భాగంగా ప్రత్యేక కట్టడాలు చేపడుతున్నామన్నారు. అంపోలు పంచాయతీ లింగాలవలస సచివాలయం భవనం వద్ద నిర్మిస్తున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. భవనం పైభాగంలో పడిన వర్షపు నీటిని నేరుగా భూమిలోకి పంపించేలా ప్రత్యేకంగా నిర్మాణం చేయడం జరిగిందన్నారు. పరిశీలనలో ఏపీవో సీహెచ్ సంధ్యారాణి, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బుడారి లక్ష్మణరావు సోమవారం పర్యవేక్షించారు. ప్రజలు సహకరిస్తే మన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఉపసర్పంచ్ చందనాల గణపతి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగరాజు ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని పొన్నాడకు చెందిన రైతులు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పంటలు పరిశీలించి, క్షేత్రస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలన్నారు. రైతులను ఆదుకోవాలని కోరారు.

ఉమారుద్రకోటేశ్వరునికి అభిషేకాలు



స్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కొటేశ్వరస్వామికి ఆశ్వీజమాస కృష్ణపక్ష సోమవారం సందర్భంగా అభిషేకాలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేయగా.. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సాగు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరంలో ఎస్సీ కులస్తులకు ప్రభుత్వం అందజేసిన ఎల్‌సీ భూములకు సాగు హక్కు కల్పించాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ నిర్వహించిన స్పందనలో ఆ గ్రామ రైతులు వినతిపత్రం అందజేశారు. 150 కుటుంబాలకు డీపట్టాలుగా అందజేశారన్నారు. ఈ భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించాలన్నారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. నిషేధిత జాబితాలో ఉండటం వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సాగు హక్కు, క్రయవిక్రయాలకు వీలు కల్పించాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం



రణస్థలం: అల్లివలసలో వైద్యులతో మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండలంలోని అల్లివలస గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధన్యత ఇస్తుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, పార్టీ మండల నాయకుడు మైలపల్లి కామరాజు, గ్రామ సర్పంచ్ చీకటి ఎర్రయ్య, మాజీ సర్పంచ్ దమ్ము పండోడు, మాజీ ఎంపీటీసీ మైలపల్లి వెంకటేష్, వైస్ సర్పంచ్ మాగుపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న ధ్యేయ

జి.సిగడాం: ప్రజారోగ్యమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎచ్చెర్ల మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. వెలగాడ గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ నిశ్చెల, ఎంఈఓ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు బొల్లా జనార్దనరావు, భూపతి సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పట్నాన శాంతి, ఉపసర్పంచ్ గొలుసుపూడి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: వెలగాడలో పౌష్టిహాకార స్టాల్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైద్యానికి అధిక ప్రాధాన్యం

గార: వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. సతివాడ పంచాయతీలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిపుణులైన వైద్యులచే రోగులకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఉచితంగా మందులు అందజేయడంతో పాటు అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ యాళ్ల సుధానారాయణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు పెదిలాపు శ్రీరాములు, రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, గంగు రామారావు, ఊట అప్పలనాయుడు ఉన్నారు.



గార: పోషకాహార కిట్‌ను అందజేస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

డీపీ దేవ్‌కు సత్కారం



డీపీ దేవ్‌ను సన్మానిస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డీపీ దేవ్‌ను ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం దేవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు మాట్లాడుతూ.. తనకు డీపీ దేవ్‌తో ఎప్పటినుంచో పరిచయం ఉందని, తన సర్వీసులో వివిధ హోదాల్లో పనిచేసి అధికారుల గుర్తింపు పొందారన్నారు. ఉద్యోగ విరమణ తరువాత కూడా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగ సంఘానికి పదేళ్లు కార్యదర్శిగా పనిచేసి సంఘం బలోపేతానికి కష్టపడి పని చేశారని గుర్తు చేశారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు దేవ్ సేవలు గుర్తించి రాష్ట్ర శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. తనను శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు డీపీ దేవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ నాయకులు రాయి వేణుగోపాలరావు, చల్లా శ్రీనివాసరావు, మణి, పాలకొండ అప్పారావు, ఆదినారాయణ, బాణాల కృష్ణారావు, గుజ్జల శాంతమూర్తి, లొట్టి నాగేశ్వరరావు, చింతనిప్పుల రాజేంద్ర తదితరులున్నారు.

వరి పొలాల పరిశీలన



కొంగరాంలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వర్షాలు అనుకూలించకపోవటంతో ముద్దాడ, కొంగరాం గ్రామాల్లో ఎండుతున్న వరి పంట పొలాలను వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం డైరెక్టర్ కె.త్రినాధస్వామి, ఏడీలు కె.కృష్ణారావు, రజిని, ఎచ్చెర్ల వ్యవసాయ అధికారి వై.సురేష్ సోమవారం పరిశీలించారు. పంటల బీమా అమలు చేయాలని, రబీ పంటలకు విత్తనాలు సరఫరా చేయాలని ఆయా గ్రామాల రైతులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

గ్రామాల్లో గౌరీపౌర్ణమి ఉత్సవాలు



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో ఆంజనేయస్వామి వేషధారణ



పూజలు అందుకుంటున్న గౌరమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట, కొత్తపేట, కేశవరావుపేట, ఎస్ఎంపురం, పొన్నాడ, ముద్దాడ, బొంతలకోడూరు గ్రామాల్లో గౌరీపౌర్ణమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో సోమవారం సందడి నెలకొంది. పలు గ్రామాల్లో సోమవారంతో ఉత్సవాలు ముగియనుండగా.. మరుకొన్ని గ్రామాల్లో మరో మూడు రోజులపాటు కొనసాగనున్నాయి.

భక్తిశ్రద్ధలతో పూజలు..

ఎచ్చెర్ల: లావేరు మండలం తామాడ గ్రామంలో గౌరీపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా గౌరమ్మ, నందీశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. వేదపండితులు మంగాటి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బిందెలతో దీపాలను వెలిగించి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



కమిటీ సభ్యులతో ఎంపికైన క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో పాల్గొనే అండర్-19 బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పూర్తిచేసినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎస్.రమణ తెలిపారు. దుప్పలవలసలో సోమవారం వివరాలు వెల్లడించారు. 11 మంది బాలురు, 10 మంది బాలికలను ఎంపిక చేసినట్లు చెప్పారు. పాఠశాల, జూనియర్ కళాశాలల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యా ప్రగతికి కృషి



వెంకటరావును సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యా ప్రగతికి కృషికి చేయనున్నట్లు విజయనగరం జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు, చిలకపాలెం శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్య సభ్యుడు దుప్పల వెంకటరావు అన్నారు. వెంకటరావును సోమవారం శ్రీశివానీ కళాశాల సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా వెంటకరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. శ్రీకాకుళం నాగర పాలక సంస్థ కమీషనర్ చల్లా ఓబిలేసు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రిన్సిపాల్ వై.సుగుణాకరరావు, శ్రీకాకుళం నగర పాలక సంస్థ ఈఈ పి.సుగుణాకరరావు, శ్రీశివానీ, శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ సభ్యులు దుర్గాప్రసాద్‌రావు, కార్తీక్ పాల్గొన్నారు.

చిన్నారులకు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం పంచాయతీ గిన్నివానిపేట వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. టాటా మ్యాజిక్ వ్యాన్‌పై స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వాహనంలో కూలెండ్ అయిల్ లీక్ కావటంతో శరీరంపై చిన్నారులకు గాయాలయ్యాయి. వీరలో ఇద్దరు ఎల్‌కేజీ, ఒకరు ఒకటో తరగతి చదువుతున్నారు. ముందుసీటులో కూర్చున్న వీరికి శరీరంపై బొబ్బలు ఏర్పడ్డాయి. డ్రైవర్ అప్రమత్తమై ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా కోలుకున్నారు. వ్యాన్‌లో 20 మంది విద్యార్థులు వరకు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీస్ కేసు నమోదు కాలేదు.

కేంద్ర ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక విధానాలు



మాట్లాడుతున్న నర్సింగరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలు తీసుకువెళ్తామని సీపీఎం నాయకులు సీహెచ్ నర్సింగరావు తెలిపారు. ఎచ్చెర్లలో సోమవారం ప్రజా రక్షణ భేరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీన మందసలో నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్యాస్, పెంట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.గోవిందరావు, అమ్మన్నాయుడు, నందోడు, చంద్రరావు పాల్గొన్నారు.

లక్ష్యసాధనపై శిక్షణ



మాట్లాడుతున్న సీతమ్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థినులకు సోమవారం తమ లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థిని మొజ్జాడ సీతమ్మ మాట్లాడుతూ.. లక్ష్యాన్ని చేరుకోవాలంటే కష్టపడి చదవాలన్నారు. సభలు, సమావేశాల్లో ఎలా మాట్లాడాలి, వేదికలపై ఎలా ప్రవర్తించాలో వివరించారు. శిక్షణలో లెక్చరర్లు పాల్గొన్నారు.

పితృవాక్యపాలనే మన కర్తవ్యం



వక్త నర్సింహమూర్తిని సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పితృవాక్య పరిపాలనే మన కర్తవ్యమని శ్రీరాముడు భరతునికి తెలియచేసినట్లు తెలుగు ఉపన్యాసకులు నిష్టల నర్సింహమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో నిర్వహిస్తున్న వాల్మీకి జయంతి ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం శ్రీరామ-భరత ధర్మ సంవాదంపై ప్రసంగించారు. ముందుగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.శ్రీనివాసరావు, రంగడు ప్రసాదరావు, ఎం.వెంకటరావు, శేషుబాబు పాల్గొన్నారు.

ప్రపంచమంతా భారతీయ సంగీత జెండా రెపరెపలు



సప్తస్వర అవధానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ సంగీతాన్ని ప్రపంచం నలుదిశలా చాటిచెప్పే ఆశయంతో నలుమూలల ప్రదర్శనలు ఇస్తున్నానని ప్రముఖ సంగీత దర్శకులు స్వరవీణాపాణి (వోగేటి నాగ వెంకట రమణమూర్తి) అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో సప్తస్వర అవధానం ప్రక్రియలో మీ మాట-నాపాట-పాట పుట్టుక ప్రదర్శన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికా, లండన్ వంటి దేశాలలో తాను స్వతహాగా స్వరపరచిన 72 మేళ కర్తరాగాలను ప్రదర్శించినట్లు తెలిపారు. 72 మేళ కర్తరాగాలలో వెలుగులోకి రాని అద్భుతమైన 40 అపూర్వ రాగాలను రేపటి తరానికి అందించడానికి సప్తస్వర అవధానాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా 72 మేళకర్త రాగాలను 6-30 నిమిషాలలో 'స్వరకామాక్షి'కీర్తన పాడి వినిపించారు. సభాసంచాలకులైన బంకుపల్లి రమేష్‌శర్మ మాట్లాడుతూ.. గిన్నిస్ రికార్డుకెక్కి మన సంగీతాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. తొలుత స్వరవీణాపాణి దంపతులను సుమిత్రా కళాసమితి సభ్యులు సత్కరించారు. అనంతరం ఏడుగురు సాహితీ పృచ్ఛకులు, ఏడుగురు సంగీత పృచ్ఛకులు చక్కనైన సాహిత్యాన్ని, రాగాలను అడుగగా స్వరవీణాపాణి స్వరపరచి వినిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, వరం రెసిడెన్సీ అధినేత అందవరపు ప్రసాద్, సమితి గౌరవ అధ్యక్షులు కొంచాడ సోమేశ్వరరావు, ప్రముఖ రచయిత్రి పిలకా శాంతమ్మ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్, సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుర్తు చిన్నారావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, పులఖండం శ్రీనివాసరావు, కొంక్యాన మురళీధర్, టి.నీరజ, వి.వి.ఆర్.మూర్తి, సురేష్, సుసరావు చంద్రశేఖరశర్మ, పైడి హరనాథరావు, భాస్కభట్ల శ్రీరామశర్మ, పి.సాయిప్రసాద్, ఎస్.నారాయణమూర్తి, మావుదురి సత్యన్నారాయణ శర్మ, సుర్యప్రసాదశర్మ, శ్రీనివాసశర్మ, సుసరావు లక్ష్మ గణపతి శర్మ, యామిని కృష్ణమూర్తి, దుసి రమేష్‌శర్మ, కనకమహాలక్ష్మి, మెట్ట పోలినాయుడు పాల్గొన్నారు.

నిద్దాం విద్యార్థుల ప్రతిభ



వెండి పతకాలతో విద్యార్థులు

జి.సిగడాం: జిల్లా స్థాయిలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో నిద్దాం ఎంపీయూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సత్తాచాటినట్లు హెచ్‌ఎం ఎస్.భాస్కరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో బి.రేవతిపతి నాయుడు, వి.రాజేష్, పి.యశ్వంత్, జె.రాజేష్, ఎ.మనోజ్, ఎస్.గౌతమ్, కె.హేమసుందరావు వెండి పతకాలను సాధించారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయం ఉపాధ్యాయుడు జి.రాహుల్ కుమార్‌ను సత్కరించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పెద్ది గోవిందరావు, సీతారాం, సత్యవేణి, పద్మజ, వెంకటరమణ, కూర్మారావు అభినందనలు తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: నగరానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని (17) అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై బలివాడ గణేష్ సోమవారం తెలిపారు. ఎచ్చెర్లలోని ఓ ప్రైవేటు కళాశాలలో పాలిటెక్నికల్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు కళాశాల బస్సు రావడంతో ఇంట్లో ఫోన్ మరిచి వెళ్లిపోయింది. ఫోన్ వదిలేసిన విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లి కళాశాలకు ఫోన్ చేసి పాప చేరిందా అని అడిగితే ప్రిన్సిపాల్ రాలేదని సమాధానం ఇవ్వడంతో చుట్టుపక్కల వెతకడం ఆరంభించారు. ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కరాటే విజేతలకు అభినందన



క్రీడాకారులతో వెంకటరావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రమశిక్షణతోనే విజయం దక్కుతోందని విజయనగరం జేఎన్‌టీయూ పాలక మండలి సభ్యులు దుప్పల వెంకటరావు అన్నారు. మాస్టర్స్ సాయిబాబాస్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రెండో అంతర్జాతీయ డ్రాగన్ ఫీస్ట్ జోటోకాన్ పోటీల్లో పతకాలు సాధించారు. వీరిని శ్రీకాకుళం అఫీషియల్ కాలనీలో ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ ప్రాంగణంలో సోమవారం అభినందించి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొంక్యాన వేణుగోపాల్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు దరహాస్ ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ:

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-19 బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం నగరానికి చెందిన వేమకోటి ధనుష్య దరహాస్ ఎంపికయ్యాడు. తిరుపతి వేదికగా నవంబర్ తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. దరహాస్ శ్రీకాకుళంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీ ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో దరహాస్ పాల్గొని పతకాలు సాధించాడు. విద్యార్థి ఎంపికపై కాలేజీ ఏజీఎం నర్సునాయుడు, డీన్ మురళీధర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.



ధనుష్య దరహాస్

రైలు ప్రమాద ఘటన బాధాకరం

శ్రీకాకుళం అర్బన్: విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాద ఘటన బాధాకరమని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.